సాక్షి బాపట్ల

బుధవారం । 10 । జులై । 2024



అన్నదానం

గురజాల: స్థానిక పాత పాటేశ్వరి అమ్మవారి దేవాలయం ఆవరణలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం అన్నదానం నిర్వహించారు.



ఆకస్మిక తనిఖీలు

రెంటచింతల: మండలంలోని విత్తనాలు, పురుగుమందుల షాపులను వ్యవసాయ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అఖండ జ్యోతి ప్రజ్వలన



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలం విఠంరాజుపల్లి శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ తొలి ఏకాదశిని పురస్కరించుకొని కొండపై తృతీయ అఖండ జ్యోతి ప్రజ్వలన నిర్వహించనున్నట్లు హిమాలయ గురూజీ తెలిపారు.

న్యూస్‌రీల్

బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా బి. సుబ్బారావు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బి. సుబ్బారావు నియమితులయ్యారు. ప్రస్తుతం అర్బన్, జగనన్న భూహక్కు, భూరక్షణ ప్రత్యేకాధికారిగా ఉన్న ఆయన్ను బాపట్ల జేసీగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సుబ్బారావు గతంలో తూర్పు గోదావరి డీఆర్వోగా పనిచేశారు.

బాలికా సదనంలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల: పట్టణంలోని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలికా సదనంలో చదువుకునేందుకు బాలికలు సంప్రదించాలని పర్యవేక్షకురాలు ఎస్.సుబ్బలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6నుంచి 12 సంవత్సరాలు వయస్సున్న బాలికలు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుకునేందుకు 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వివరాలకు అక్బర్‌పేటలోని బాలిక సదనంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలుశిక్ష

అద్దంకి రూరల్: హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ. 5 వేలు జరిమానా విధిస్తూ అద్దంకి అడిషనల్ సెషన్స్ జడ్జి వెంకట నాగలక్ష్మి తీర్పు ఇచ్చినట్లు ఏపీపీ ఎస్. కుసుమలత తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. జే పంగులూరు మండలం భగవాన్‌రాజు పాలెం పరిధిలోని జనరాజుపల్లి కృపారావును అతని బావమరిది నిందితుడైన చింతలచెరువు పెద అంజయ్యకు పొలం కొనే విషయంలో తగాదాలు వచ్చాయి. ఈ క్రమంలో పొలంలో నిద్రిస్తున్న కృపారావును పెద అంజయ్య 20 డిసెంబర్ 2020న తాటాకు నరికే పెద్ద కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో కృపారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ నేరం మంగళవారం రుజువు అవ్వడంతో నిందితుడు పెద అంజయ్యకు న్యాయమూర్తి శిక్ష విధించారు. ఈ కేసులో వాదనలు వినిపించిన ఏపీపీ ఎస్. కుసుమలత, కోర్టు కానిస్టేబుల్ వీరబ్రహ్మం, ఇతర కానిస్టేబుళ్లను పలువురు న్యాయవాదులు అభినందించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



బాపట్ల: ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని లీగల సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.పి.బాలాజీ సూచించారు. స్థానిక కోర్టు సముదాయంలో మంగళవారం న్యాయవాదులు, గుమస్తాలు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు, డ్రైవర్లకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణించటం ప్రమాదకరమని తెలిపారు. ట్రిపుల్ డ్రైవింగ్ కూడా చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.వాణి, బార్ అ సోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యప్రసాద్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమార్, ఆర్ఎస్ఐ కె.సుధాకర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్‌పై దాడికి యత్నం

రక్షణ కల్పించాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

అద్దంకి: అధికారంలోకి వచ్చిన నాటినుంచి రోజురోజుకీ తెలుగుదేశం పార్టీ నాయకులు దాడులు పెచ్చు మీరుతున్నాయి. వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల కన్వీనర్‌ను ఫోన్‌లో టీడీపీ సానుభూతిపరుడు పరుష పదజాలంతో దుర్భాషలాడి, తరువాత ఇంటికి వచ్చి దాడికి యత్నించిన ఘటన మండలంలోని విప్పర్లవారిపాలెంలో సోమవారం రాత్రి జరిగింది. బాధితుడు మంగళవారం స్టేషన్‌లో ఫిర్యాదుతో ఇది వెలుగు చూసింది. మండలంలోని వెంకటాపురానికి చెందిన ఇన్నర్ల వెంకట్రావు వైస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన బి. పవన్ కల్యాణ్‌కు ఆయనకు ఫోన్ చేసి దుర్భాషలాడాడు. ఈ ఐదు సంవత్సరాలు నువ్వు బయట తిరగడానికి వీల్లేదని వార్నింగ్ ఇచ్చాడు. అంతటితో ఊరుకోకుండా మరో ఇద్దరితో ఇంటికొచ్చి దాడికి యత్నించాడు. దాంతో వెంకట్రావు పోలీసులకు ఫోన్ చేయడంతో వారు రావడాన్ని గమనించిన కల్యాణ్ అక్కడ నుంచి జారుకున్నాడు. గతంలో గడప గడప కార్యక్రమం గ్రామంలో నిర్వహించిన సమయంలోనూ అతను దాడికి యత్నించాడని, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని వెంకట్రావు వాపోయారు. రక్షణ కల్పించాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పరాయి పంచన ఎన్నాళ్లు ?

- బదిలీ చేయండి... ప్లీజ్ !
- ఇక్కడ ఉద్యోగం ఇంకెన్నాళ్లంటూ ఉద్యోగులు ఆవేదన
- సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఎదురుచూపులు
- ఉత్తర్వులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వం
- ఎన్నికలు ముగిసినా జరగని బదిలీలు
- నాలుగు నెలలుగా ఇతర జిల్లాల్లోనే విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు



చీరాల: సార్వత్రిక ఎన్నికల్ని సమర్థంగా నిర్వహించే ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఇతర జిల్లాలకు చెందిన అధికారుల్ని వేరొక జిల్లాకు బదిలీ చేస్తుంటుంది. ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి ఫలితాలు వచ్చిన రెండు వారాల్లోపే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారుల్ని వారి సొంత జిల్లాలకు పంపిస్తుంటారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే నిబంధనల ప్రకారం ఒకేచోట మూడేళ్లు పనిచేస్తున్న వారిని, సొంత జిల్లాల వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఈ ఏడాది మార్చిలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. మే 13న పోలింగ్ జరిగింది. జూన్ 4న ఫలితాల్ని కూడా ప్రకటించారు. ఎన్నికలకు ముందు బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల, పర్చూరు, అద్దంకి, రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల పరిధిలోని అన్నీ మండలాలకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులు, వివిధ శాఖల గజిటెడ్ అధికారుల బదిలీ చేపట్టారు.

కుటుంబాలకు దూరంగా ఉంటూ అవస్థలు

జిల్లాకు కాకినాడ, విశాఖపట్నం, ఏలూరు, కృష్ణా జిల్లాల నుంచి అధికారులు వచ్చి ఎన్నికల విధులు నిర్వహించారు. అయితే, జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడటం, కూటమి ప్రభుత్వం కొలువు దీరింది. గతనెల 8న కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల కోడ్‌ను ఎత్తి వేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఇతర జిల్లాల నుంచి ఎన్నికల విధుల కోసం వచ్చిన డివిజినల్, సబ్ డివిజినల్, ఆర్డీవో, డీఆర్‌డీఏ, పీఆర్ తదితర శాఖల అధికారులు, ఉద్యోగుల బదిలీలపై దృష్టి సారించలేదు. దీంతో గత గత నాలుగు నెలల నుంచి వారంతా కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు. దూర ప్రాంత జిల్లాలకు వచ్చి విధులు నిర్వహిస్తున్నప్పటికీ తమను పట్టించుకోకపోవడంతో మానసిక క్షోభను అనుభవిస్తున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. నిరాశ, నిస్పృహలతో బదిలీల ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, పిల్లల చదువులు, ఇతర అనేక సమస్యలతో సతమతమవుతున్నామని తమను సొంత జిల్లాలకు బదిలీలు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు ?

ఎన్నికల విధుల్లో భాగంగా కాకినాడ ఆర్డీవో చీరాలకు బదిలీపై వచ్చారు. చీరాల మున్సిపల్ కమిషనర్ వైజాగ్ నుంచి చీరాలకు బదిలీ అయ్యారు. చీరాల, వేటపాలెం తహసీల్దార్లు గుంటూరు నుంచి వచ్చి ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే బాపట్ల జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో అన్నీ శాఖల అధికారులు బదిలీలు జరగక ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల నేదపథ్యంలో జిల్లాలకు, నియోజకవర్గాలకు చెందిన అధికారులు, సిబ్బందితో పాటుగా సాధారణ ఉద్యోగులు సైతం బదిలీల జీవో కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాల విభజన సమయంలో కొన్ని శాఖల అధికారులు ఒంగోలు, పల్నాడు, నెల్లూరు జిల్లాలకు వెళ్లారు. జీవో విడుదల చేసి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన బదిలీలు చేపడితే సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఎదురుచూపులు చూస్తున్నారు. నూతన జిల్లాల ప్రకారం బదిలీలు చేస్తే తాము అన్నీ విధాలా నష్టపోతామని, ప్రభుత్వం త్వరగా జీవో విడుదల చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు కోరుతున్నారు.

తమవారి కోసం ప్రజాప్రతినిధుల పట్టు

గత ప్రభుత్వ హయాంలో జిల్లా, డివిజనల్, మండల, పట్టణ స్థాయిల్లోని కీలక పోస్టుల్లో పనిచేసి వెళ్లిన వారిని ప్రస్తుతం పాత పోస్టుల్లోకి తెప్పించేందుకు కూటమి ప్రజాప్రతినిధులు విముఖత చూపుతున్నారు. తమ సామాజికవర్గాలకు చెందిన వారితో పాటుగా తమకు అనుకూలంగా వ్యవహరించే పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, సర్వే, కీలక అధికారుల్ని నియమించుకునేందుకు పట్టు పడుతున్నారు. తమకు అనుకూలంగా పనిచేసే వారి కోసం సిఫార్సు లేఖలు ఇచ్చే విషయంలో పలుమార్లు విచారణలు చేయిస్తున్నారు. పోలీసు శాఖలో డీఎస్పీ, సీఐ, ఎస్ఐలతో పాటుగా కానిస్టేబుళ్లతో పాటుగా స్పెషల్ బ్రాంచి పోలీసులు సైతం తమవారినే నియమించుకునేందుకు ప్రజాప్రతినిధులు జాబితాలు తయారు చేస్తున్నారు. పోస్టింగ్‌ల వ్యవహారంలో సైతం డిమాండ్లు, పైరవీలు జరిగేలా ఉన్నాయి. బదిలీల జీవో రాగానే తమ వారినే ప్రభుత్వ ఉద్యోగుల్లో కీలక పోస్టుల్లో నియమించేందుకు అన్నీ ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటున్నారు. నేతలు చెప్పిన వారికే పోస్టింగులు వచ్చేలా ఉన్నాయి. అయితే, ఉద్యోగుల బదిలీల జీవో విడుదల కావడంతో కేవలం టీడీపీ నేతలు చెప్పిన వారినే నియమిస్తారని, కూటమిలో ఉన్న జనసేన, బీజేపీ నాయకులకు ప్రాధాన్యత ఉండదని ప్రచారం జోరుగా జరుగుతుంది. ఏది ఏమైనా ఉద్యోగుల బదిలీలు జరిగితే చాలా లీలలు బయటపడేట్టు ఉన్నాయి.

ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: నిత్యావసర సరుకుల ధరలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. రైస్, డాల్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ధరల తగ్గింపుపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రా రైస్ కిలోను రూ.48, స్టీమ్ రైస్‌ను రూ.49, కందిపప్పు కేజీని రూ.160కు అమ్మాలని సూచించారు. దీనికి జిల్లా అసోసియేషన్ నాయకులంతా ఏకగ్రీవంగా ఆమోదించడంతో ఈనెల 11వ తేదీ నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించనున్నట్లు ఆయన ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా బాపట్ల, చీరాల, అద్దంకి, పర్చూరు, రేపల్లె, వేమూరు ప్రాంతాలలోనూ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిత్యావసర సరుకుల ధరలు మార్కెట్లో అధికంగా ఉన్నందున తగ్గే వరకు ప్రత్యేక కౌంటర్లు కొనసాగుతాయని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేయడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ వివరించారు. కృత్రిమ కొరత, డిమాండ్ సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిత్యావసర సరుకులు అక్రమంగా నిల్వ చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మిల్లర్లు కూడా ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్, మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్ బాబు, మిల్లర్ల అసోసియేషన్ నాయకులు బొమ్మిశెట్టి రత్నగుప్తా, శ్రీనివాసరావు, హనుమంతరావు, సుజాత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

లైంగిక వేధింపులకు దీటుగా స్పందించాలి

కొల్లూరు : వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది తమకు ఎదురయ్యే లైంగిక వేధింపులకు దీటుగా స్పందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ లైంగిక వేధింపుల నిరోధక బృంద సభ్యులు సూచించారు. బాధితులకు తోటి సిబ్బంది కూడా అండగా నిలవాలని చెప్పారు. కొల్లూరు పీహెచ్‌సీలో గతంలో వైద్యాధికారి దావులూరి రవిబాబు ప్రవర్తన కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. వారిలో మనోధైర్యం నింపేందుకు ప్రయత్నించారు. ఇందులో భాగంగా వైద్యాధికారి నుంచి లైంగిక వేధింపులు ఎదుర్కొన్న సిబ్బందిని తిరిగి విచారించిన బృంద సభ్యులు వారి నుంచి లిఖిత పూర్వకంగా తిరిగి వాంగ్మూలాలు సేకరించారు. వీరికి తోడు పీహెచ్‌సీ వైద్యురాలు కావ్యతేజ నుంచి మరికొంత సమాచారం రాబట్టారు. మహిళా సిబ్బంది లైంగిక వేధింపులకు గురవుతున్న పక్షంలో తాత్సారం చేయకుండా అధికారులకు ఫిర్యాదు చేసిన పక్షంలో సంబంధిత వ్యక్తులపై తక్షణం చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని సభ్యులు సూచించారు. విచారణ అనంతరం రావికంపాడు, కొల్లూరు సబ్ సెంటర్ల పరిధిలోని కొన్ని ప్రాంతాలలో గర్భిణుల నమోదు సంఖ్య తక్కువగా ఉండటంపై చర్చించారు. సకాలంలో వారికి వ్యాక్సిన్లు అందించడంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. సమస్య పునరావృతం అవకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.



కొల్లూరు పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న బృంద సభ్యులు

మీ పిల్లలను ఇలాంటి చోట చదివిస్తారా ?

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆగ్రహం
- యద్దనపూడి గురుకుల బాలికల పాఠశాల తనిఖీ
- విద్యార్థినుల స్నానాలకు కూడా నీరు కరువు
- అధ్వానంగా వసతి గదులు



వంట గదిని పరిశీలిస్తున్న పద్మావతి



విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకుంటున్న పద్మావతి

యద్దనపూడి: గురుకుల పాఠశాలలో వసతులు కరుడుగట్టిన ఖైదీలకు ఇచ్చే వాటి కన్నా అధ్వానంగా ఉన్నాయని.. మీ పిల్లల్ని ఇంత అధ్వానంగా ఉన్న పాఠశాలలో చదివిస్తారా ? అంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు బత్తుల పద్మావతి యద్దనపూడిలోని బాలికల గురుకుల పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మంగళవారం గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. 600 మంది బాలికలు ఉన్న పాఠశాలలో పారిశుద్ధ్యం మరీ అధ్వానంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. కనీసం స్నానాలకు నీళ్లు కూడా లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పరిసరాలు మొత్తం చిల్లచెట్లు పెరిగి ఉండటంతో పాటు మురుగునీరు నిలిచి ఉండటం గమనించారు. ఆవరణలో కుక్కలు, విషసర్పాలు సంచరిస్తున్నట్లు విద్యార్థినులు చెప్పడంతో ఏం చేస్తున్నారంటూ ? సిబ్బందిని ఆమె ప్రశ్నించారు. వసతి గృహంలో మరుగుదొడ్లు, సంపులు నిండిపోయి గదులు మొత్తం తీవ్ర దుర్గంధం వ్యాపిస్తుండటంతో ఆమె సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

బాలికలు బాగోగులు పట్టించుకోవాల్సిన ప్రిన్సిపాల్ స్థానికంగా ఉండటం లేదని తెలుసుకొని సెలవులో ఉన్న ఆమెకు ఫోన్ చేశారు. పాఠశాల మొత్తం ఇలా ఉంటే ఏం చేస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వసతులు ఉన్న చోట మన పిల్లలను చదివిస్తామా ? నిరుపేదలైన తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని ఇక్కడికి పంపిస్తే... ఇంతటి దుర్గంధం మధ్య ఉంచటం మీకు న్యాయమేనా ? అంటూ ఆమెపై విరుచుకుపడ్డారు. నిర్లక్ష్యంగా ఉండటం ప్రిన్సిపాల్‌కు కొత్తేమి కాదని, గతంలో కూడా ఎంతో మంది అధికారులు తనిఖీలు చేసి పారిశుద్ధ్యం మెరుగు పరచాలని ఆదేశించినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్తామని బత్తుల పద్మావతి హామీ ఇచ్చారు. అనంతరం వంటి గదిని పరిశీలించారు. ప్రతి నెలా కోటా అలాట్మెంట్ జరుగుతుందా ? అవకతవకలు ఏమైనా ఉన్నాయా ? అంటూ సిబ్బందిని అడిగారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను రాతపూర్వకంగా తీసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమస్యను వారంలో పరిష్కరించాలని గురుకుల డిస్టిక్ కోఆర్డినేటర్ పద్మజను ఆదేశించారు. లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక నుంచి ప్రతి నెలా ఆకస్మిక తనిఖీలు ఉంటాయని, ఎలాంటి లోపం జరిగినా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, ఎంఈవో గోపి, సీడీపీవో జి. సుభద్ర, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పురుషోత్తం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య, ఎస్ఐ జి.వి. చౌదరి, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

జిల్లా వనరుల కేంద్రం కోఆర్డినేటర్ విజయనిర్మల



సదస్సులో పాల్గొన్న వ్యవసాయాధికారులు, ఏరువాక శాస్త్రవేత్తలు

చీరాల రూరల్: శాస్త్రవేత్తల సిఫార్సుల కనుగుణంగా ప్రకృతి వ్యవసాయం, సమతుల ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతుల్ని పాటించి రైతులు వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధిస్తారని జిల్లా వనరుల కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ ఎం. విజయనిర్మల సూచించారు. స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద మంగళవారం ప్రకృతి వ్యవసాయం, మట్టి నమూనా, సమతుల ఎరువులు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయనిర్మల మాట్లాడుతూ రైతులు ముందుగా విత్తన శుద్ధిని కచ్చితంగా పాటించాలని సూచించారు. ఏరువాక శాస్త్రవేత్త ఉషారాణి చీరాల మండలానికి అనుకూలమైన పంటల గురించి రైతులకు వివరించారు. మొక్కజొన్న, వేరుశనగ, వరి పంటల సాగు, ఎరువులు మోతాదు గురించి తెలియజేశారు. మరో ఏరువాక శాస్త్రవేత్త బాపట్ల రాధాకృష్ణ మొక్కజొన్న, వేరుశనగ పంటలలో వచ్చే చీడపీడల గురించి, తెగుళ్ల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వరి ఎదబెట్టడం, నాట్లు వేయడం, మేలైన యాజమాన్య పద్ధతులు తెలియజేశారు. సాగు ఖర్చు తగ్గించుకునే విధానాలపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్ భారతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల సాగుబడి ఖర్చులు భారీగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం అందించవచ్చనని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ సూత్రాల్ని వివరించారు. ఏడాది పొడవునా నేలను వివిధ రకాల పంటలతో కప్పి ఉంచడం ద్వారా ఉష్ణోగ్రతను తగ్గించవచ్చని తెలిపారు. జీవ ఉత్ప్రేరకాలు వినియోగం, దేశవాళీ విత్తనాల వాడకం, సేంద్రియ సాగు పద్ధతులు, కషాయంతో చీడపీడలు నివారణ, నేలను వీలైనంత తక్కువగా దున్నుకోవడం, పోషణ జీవామృతం ద్వారా ఇవ్వడం, నేలలో కర్బనం పెంపు, పురుగులు తెగులు యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో బాపట్ల ఏరువాక కోఆర్డినేటర్ మురళీధరనాయక్, బాపట్ల, చీరాల ఏడీఏలు రత్నకుమారి, కె. భాస్కరరావు, చీరాల వ్యవసాయాధికారి ఎ. సుమతి, అన్ని గ్రామాల ఈఏఓలు, రైతులు పాల్గొన్నారు.

రూ. 5.51 లక్షల విలువైన

పురుగు మందుల అమ్మకాలు నిలిపివేత



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కొల్లూరు : అనుమతి పత్రాలు లేకుండా అమ్మకాలకు ఉంచిన రూ. 5.51 లక్షల విలువైన ఎరువులు, పురుగుమందుల అమ్మకాలను విజిలెన్స్, వ్యవసాయశాఖాధికారులు నిలుపుదల చేశారు. కొల్లూరులోని పలు పురుగు మందులు, ఎరువులు, విత్తనాల దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అమ్మకాలకు అనుమతి పత్రాలతోపాటు, రిజిస్టర్లు, బిల్ పుస్తకాలు, దుకాణాలలో నిల్వల వివరాలను పరిశీలించారు. మూడు దుకాణాలలో ఓ కంపెనీకి చెందిన రూ. 5, 51,455 విలువైన 230 కిలోల పురుగు మందులకు పత్రాలు లేకపోవడాన్ని గుర్తించి అమ్మకాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. దుకాణాలలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించడం, అధిక ధరలకు అమ్మకాలు చేపట్టడం వంటి చర్యలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారుల్ని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారి సీహెచ్. రవికుమార్, కొల్లూరు మండల వ్యవసాయాధికారి పి. వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయం టెక్నికల్ ఏవో తిరుమలరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురుగు మందుల షాపులో తనిఖీలు



చుండూరు(వేమూరు) : రైతులకు ఎరువులు, పురుగు మందుల అమ్మకాలలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ సీహెచ్. రవికుమార్ తెలిపారు. చుండూరు మండల కేంద్రంలోని రాము ట్రేడర్స్‌లో మంగళవారం విజిలెన్స్, వ్యవసాయ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలతో పాటు స్టాక్‌ను పరిశీలించారు. విత్తన అమ్మకాలకు కంపెనీల సెంట్రలైజ్డ్ సీడ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఏడీఏ షాపు నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

80 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

చేబ్రోలు: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని చేబ్రోలు పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు నుంచి పొన్నూరు వైపునకు లారీలో సుమారు నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని 80 బస్తాల్లో తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ పి.మహేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది స్థానిక సినిమా హాలు సమీపంలో లారీని అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు శివనాగరాజు 12వ లైనుకు చెందిన తమ్మిశెట్టి వీరాస్వామి, గుంటూరు రూరల్ మండలం దాసరిపాలేనికి చెందిన కొమిర వీరాస్వామిలను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. ఘటనపై చేబ్రోలు ఎస్ఐ పి. మహేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ

మంగళగిరి: యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో చోరీ జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాలనీలో ఉంటున్న సురేష్ కుటుంబంతో కలిసి ఈనెల 6న ఊరికి వెళారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. చోరీ జరిగిందని గ్రహించి సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.15 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు మాయమైనట్టు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భ్రూణ హత్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు

ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: భ్రూణ హత్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్డీవో హెలా షారోన్ హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలపై వివిధ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, ఆస్పత్రుల వైద్యులతో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్కానింగ్‌ల ద్వారా గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదన్నారు. తల్లిదండ్రులకు గర్భంలో ఉన్నది ఆడ శిశువా, మగ శిశువా అనేది ఎట్టి పరిస్థితుల్లో తెలియజేయరాదని స్పష్టం చేశారు. లింగ వివక్షతను వీడి ప్రతి ఒక్కరూ ఆడ శిశువుకైనా, మగ శిశువుకైనా జన్మనివ్వాలని సూచించారు. సమాజంలో రోజురోజుకు స్త్రీ నిష్పత్తి తగ్గిపోతుందని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై నిరంతరం పర్యవేక్షించేందుకు కమిటీ కూడా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన వైద్యుని సలహా మేరకు మాత్రమే గర్భంలో శిశువు ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు మాత్రమే స్కానింగ్ పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. చట్టాన్ని వ్యతిరేకించి లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకునే తల్లిదండ్రులపై చర్యలతో పాటు స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి రత్నశ్రీ , డెప్యూటీ డెమో మరియమ్మ, ఏపీపీ పీఎస్‌బీ శర్మ, సీఐ నజీర్‌బేగ్, డాక్టరుల్లు వసంతం వీరరాఘవయ్య, చైతన్య, రమేష్, జాన్ ప్రసాద్, ఎన్జీవో ప్రభాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

అంకితభావంతో పని చేసినప్పుడే అవార్డులు సాధ్యం

ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: అంకితభావంతో పనిచేసినప్పుడే అవార్డుల్ని సాధించగలరని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. దానికి నిదర్శనమే జిల్లా పోలీస్ యంత్రాంగం అందుకున్న సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు అన్నారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం పోలీస్ శాఖకు జారీ చేసిన సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును బాపట్ల ఎస్‌బీ సీఐ మల్లికార్జునకు కేటాయించడం హర్షణీయమన్నారు. తన కార్యాలయంలో మంగళవారం మల్లికార్జునకు అవార్డును అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో ప్రజలకు వేగవంతంగా, అత్యుత్తమ, నాణ్యమైన సేవలు అందించినందుకు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును ఇస్తుందని తెలిపారు. ఈ సంవత్సరం బాపట్ల జిల్లాలోని ఎస్‌బీ విభాగం అత్యుత్తమ ప్రతిభ కనపరిచినందుకు బాపట్ల జిల్లా పోలీస్ శాఖకు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును ఇచ్చినట్లు వివరించారు. ఇది ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఇటువంటి అవార్డుల్ని సమష్టి కృషితోనే సాధించగలమని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎస్‌బీ యంత్రాంగానికి క్రమ పద్ధతిలో ఉత్తర్వులు ఇస్తూ సమర్థంగా విధుల నిర్వహణలో సీఐ మల్లికార్జున పాత్ర ఎంతో కీలకమైందని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఇతర అధికారులు కూడా విధులు నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు.



ఎస్‌బీ సీఐ మల్లికార్జునకు అవార్డు అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

డయేరియాపై నిర్లక్ష్యం వద్దు

నిజాంపట్నం: డయేరియాపై నిర్లక్ష్యం వహించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ప్రధానోపాధ్యాయుడు పులిగడ్డ నరేంద్ర ప్రసాద్ తెలిపారు. కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అక్కడి ఎస్‌పీఆర్ఆర్ హైస్కూల్లో విద్యార్థులకు డయేరియాపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వైద్యుల సూచనలు పాటించి అతిసార వ్యాధికి దూరంగా ఉండాలని సూచించారు. కలుషిత నీటివల్ల డయేరియా వ్యాపించే అవకాశం ఎక్కువ ఉంటుందని, విద్యార్థులంతా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.హెల్త్ సూపర్‌వైజర్ మురళి మాట్లాడుతూ తీవ్ర జ్వరం, తలనొప్పి, కీళ్ల, కండరాల నొప్పులు, వికారం, అలసట తదితర లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయరాదని తెలిపారు. వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు.అనంతరం విద్యార్థులతో గ్రామంలో డయేరియాపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కూచినపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

అగ్రి స్టార్టప్‌ల ద్వారా యువతకు వ్యాపార అవకాశాలు

గుంటూరు రూరల్: వ్యవసాయ రంగంలో ఔత్సాహిక యువతకు అగ్రి స్టార్టప్‌ల ద్వారా విస్తృతస్థాయిలో వ్యాపార అవకాశాలు కల్పించే దిశగా శిక్షణ ఇచ్చేందుకు కృషిచేస్తున్నామని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాంఫాం ఆడిటోరియంలో జరిగిన వర్క్‌షాప్‌లో వీసీ మాట్లాడారు. వ్యవసాయ రంగంలో అన్ని రకాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చేందుకు ప్రస్తుతం తిరుపతిలో ఒకే ఒక్క కేంద్రం పనిచేస్తోందని, వీటిని మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు శాస్త్రవేత్తలు కృషిచేయాలని సూచించారు. పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పరిధిలో పరిశోధన ఫలితాలను, వ్యవసాయ ఆవిష్కరణలను అగ్రి స్టార్టప్‌ల ద్వారా మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సూచించారు. అగ్రికల్చర్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి మాట్లాడుతూ అగ్రిస్టార్టప్‌లను విస్తరించాలని పేర్కొన్నారు. డీన్ డాక్టర్ జి కరుణాసాగర్ మాట్లాడుతూ 2020 నుంచి అమలులోకి వచ్చిన నూతన విద్యావిధానంలో వ్యవసాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులనూ స్టార్టప్‌లలో లింక్‌చేసి వారిలోని నైపుణ్యాలను వెలికి తీసి వినియోగించుకోవాలని సూచించారు. రెండు రోజులపాటు జరిగే బిల్డింగ్ అగ్రి ఇన్నోవేషన్స్ అండ్ ఎంటర్‌పెన్యూర్‌షిప్ ఇంక్యుబేషన్ ఇన్ అంగ్రూ అనే కార్యక్రమం బుధవారంతో ముగియనుంది. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ ఎస్‌వీపీఎస్ దుర్గా ప్రసాద్, విశ్వవిద్యాలయం పోషణ్ ఇంక్యుబేటర్ అధిపతి డాక్టర్ కదిరి మోహన్ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి

ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులకు ఉపకార వేతనాలు



గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో చదువుతున్న ఆరుగురు విద్యార్థినులు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అందించే ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ప్రభాకరరావు తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఏఐసీటీఈ ప్రగతి ఉపకార వేతనాలు అందించి, ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా తమ కళాశాలలో డిప్లొమా ప్రథమ సంవత్సరం చదువుతున్న వారిలో 30 మంది విద్యార్థినులు దరఖాస్తు చేసుకోగా, వారిలో ఆరుగురు ఎంపికైనట్లు వివరించారు. కుంచాల వైష్ణవి, వాసిమళ్ల బ్యూలా, కానోజియా దేవంతి, సిరిపురపు హర్షిత, క్రోసూరి రుషిత, సోమరౌతు లిఖిత వేదసాయి మాన్వితకు ఏడాదికి రూ.50 వేలు చొప్పున మూడేళ్లపాటు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి బి. రామసుందరి, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


క్వారీ గుంతలో పడి యువకుడి ఆత్మహత్య



దాచేపల్లి: క్వారీ గుంతలో పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం జరిగింది. ఎస్ఐ జీ.సంధ్యారాణి తెలిపిన వివరాలు .. మాచవరం మండలం వేమవరానికి చెందిన ఉప్పుతోళ్ల తిరుపతయ్య(21) మద్యానికి బానిసగా మారాడు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ పెట్రోల్ బంకులో పని చేస్తున్న క్రమంలో అతిగా మద్యం తాగి విధులకు హాజరుకావడంతో యజమానులు తొలగించారు. నాలుగు రోజుల కిందట వేమవరం వచ్చి తండ్రి వద్దనే ఉంటున్నాడు. మద్యానికి బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నావని తండ్రి మందలించి, మద్యం తాగకుండా అడ్డుకున్నాడు. దీంతో ఇంటి నుంచి బయలుదేరిన తిరుపతయ్య నడికుడి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. స్టేషన్ సమీపంలోని క్వారీ గుంతలో దిగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు స్థానికుల సహాయంతో నీళ్లలో తేలాడుతున్న మృతదేహాన్ని ఒడ్డుకు తీయించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు అవివాహితుడు.

గణపవరంలో చోరీ

రూ.40 వేలు అపహరణ



దుండగులు నగదు కాజేసిన బ్యాగు

నాదెండ్ల: గణపవరం రామ్‌నగర్‌లో ఓ ఇంట్లో చోరీ సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. శాంతినగర్ రామాలయం వెనుక బజారులో నివాసం ఉండే కొత్తకోట లక్ష్మి, భర్త ప్రసాద్ చిలకలూరిపేట పట్టణంలో కూలీ పనులకు వెళ్తుంటారు. వీరి కుమారుడు గుంటూరులో ఉద్యోగం చేస్తుంటాడు. ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి తాళాలు పగలగొట్టి బీరువా తెరిచారు. పక్కనే బ్యాగులో ఉన్న రూ.40 వేల నగదు అపహరించారు. దీనిపై బాధితురాలు లక్ష్మి నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. గణపవరంలో వరుస దొంగతనాలతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఓలేరు హైవే పక్కన అనుమతి లేని లేఅవుట్లు

- 'బౌడ' హెచ్చరికలు జారీ
- లేఅవుట్లలో ఫ్లెక్సీ ఏర్పాటు

ఓలేరు(భట్టిప్రోలు): మండలంలోని ఓలేరులో హైవే పక్కనే అనుమతులు లేకుండా ఐదు లేఅవుట్లు ఏర్పాటు చేయడంతో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బౌడ) కార్యాలయ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. లేఅవుట్లలో ఆక్రమణలను తొలగించి ఫ్లెక్సీలర ఏర్పాటు చేశారు. సర్వే నంబర్ 362/1, 362/2ఎ, 352/3బి, 271/2, 272/5, 271/1లోని లేఅవుట్లకు గ్రామ పంచాయతీ, బౌడ, డీటీసీపీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ప్లాట్లు అమ్మినా లేదా కొనుగోలు చేసినా చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. లేఅవుట్లు ఏర్పాటు చేసేటప్పుడు 40 అడుగుల రహదారి, విద్యుత్ సౌకర్యం, పార్కు ఏర్పాటు చేసేందుకు 10 శాతం స్థలం పంచాయతీకి ఇవ్వాలి. ఈ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి లేఅవుట్లు ఏర్పాటు చేయడంతో విజిలెన్స్ శాఖకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో బౌడ శాఖాధికారులు ఓలేరు వచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐ. మునిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎ. శ్రీదేవి, మండల సర్వేయర్ బొర్రా శ్రీనివాసరావు, వీఆర్వో రాంబాబు, గ్రామ సర్వేయర్ రాంబాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఓలేరు హైవే పక్కన లే-అవుట్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సర్పంచ్ అవినీతిపై గ్రామస్తుల ఫిర్యాదు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు గ్రామ పంచాయతీ పాలకవర్గంలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. టీడీపీ పాలకవర్గంలో ఉన్న గ్రామ సర్పంచ్ బి. శివపార్వతి, ఆమె భర్త బి. శ్రీనివాసరావు, ఆమె మరిది బి. బ్రహ్మయ్య పంచాయతీ నిధుల్ని దోచుకుంటున్నారని ఆరోపిస్తూ టీడీపీ పాలక సభ్యులతో పాటు గ్రామస్తులు మంగళవారం ఎంపీడీవో బి.బాబూరావును కలసి ఫిర్యాదు చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి బాధ్యుల్ని శిక్షించాలని వినతి పత్రంలో కోరారు.
2019 వరకు ఉన్న ప్రత్యేక అధికారుల పాలనలో అప్పటి పంచాయతీ కార్యదర్శితో పాటు మరికొంత మంది కలసి రూ.1 కోటి నిధుల్ని దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2021 ఏప్రిల్ ఏర్పడిన నూతన పాలకవర్గంలో సర్పంచ్, ఆమె బంధువులు కలసి సిబ్బందికి జీతాల చెల్లింపులు, చిన్నచిన్న మరమ్మతులు, పారిశుద్ధ్యం, ఇతర పనులను అడ్డుపెట్టుకొని రూ. లక్షల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేయించాలని కోరారు.



ఎంపీడీవోకు ఫిర్యాదు అందిస్తున్న పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు

ముగిసిన కబడ్డీ పోటీలు

గుంటూరు రూరల్: క్రీడల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని నల్లపాడు పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ హనీమెహత తెలిపారు. మంగళవారం నల్లపాడు గ్రామంలోని కేంద్రీయ విద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న క్లస్టర్ స్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ హైదరాబాద్ రీజియన్ ఆదేశాల మేరకు ఈనెల 8, 9 తేదీలలో అండర్–17 బాలికల ప్రాంతీయ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించామని పేర్కొన్నారు. వివిధ క్లస్టర్ల నుంచి 84 మంది క్రీడాకారులు, ఏడు జట్లు పోటీలో పాల్గొన్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఆరుగురు అధికారుల బృందం మ్యాచ్‌లను నిర్వహించినట్టు వెల్లడించారు. కబడ్డీలో బాలికల నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. రెండు రోజులపాటు జరిగిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్ 17 విభాగంలో హోరాహోరీగా సాగిన పోటీలో అనంతపురానికి చెందిన కబడ్డీ జట్టు విజేతగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో స్కూల్ నామినీ చైర్మన్ బి రవికుమార్, ఉపాధ్యాయులు టి లక్ష్మీప్రసన్న, ఎస్ ఆనంద్, సునీల, పీఈటీలు అంజలి, ఆర్ చాంగ్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



విజేతల జట్టుకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ హనీమెహత తదితరులు

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

రిటైర్డ్ ఐఏఎస్ శామ్యూల్ ఆనంద్

చేబ్రోలు: ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చని రిటైర్డు ఐఏఎస్ శామ్యూల్ ఆనంద్ చెప్పారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలో రైతు ఎస్.ఉమామహేశ్వరరావు పొలంలో 30 రకాల పంటల వైవిధ్యంతో కూడిన పీఎండీఎస్ క్షేత్రాన్ని అధికారుల బృందం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రధాన పంటల కంటే ముందుగా 30 రకాల జీవ వైవిధ్య పంటలతో కూడిన పచ్చిరొట్ట పంటలు వేసిన రైతు పొలంలో నత్రజని స్థిరీకరించే రైజోబియం, వేరు బుడిపెలు విస్తారంగా అభివృద్ధి చెందడాన్ని గుర్తించింది. ఈ సందర్భంగా రిటైర్డు ఐఏఎస్ శ్యామ్యూల్ ఆనంద్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి తదితరులు మాట్లాడుతూ ప్రధాన పంటల సాగులో వేరు వ్యవస్థ ప్రధానమైందన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ పర్యవేక్షకులు వెంకట్రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్థానిక రైతులు పాల్గొన్నారు.



వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న రిటైర్డు ఐఏఎస్ శ్యామూల్ ఆనంద్, ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి

దేశ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

- ఇండియన్ నావెల్ అకాడమీ సబ్ లెఫ్టినెంట్ సాయిరామ్
- ఆర్‌వీఆర్‌జేసీలో స్టార్టప్ అండ్ కెరీర్ ఆపర్చునిటీస్ ఇన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌పై సదస్సు

గుంటూరు రూరల్: భారత రక్షణ దళాలలోని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగించుకుంటూ, దేశ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఇండియన్ నావెల్ అకాడమీ (కేరళ) సబ్ లెఫ్టినెంట్ సాయిరామ్ పేర్కొన్నారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్టార్టప్ అండ్ కెరీర్ ఆపర్చునిటీస్ ఇన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌పై సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు కవాతు నిర్వహించి గౌరవ స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ భారత రక్షణ దళాల్లో బీటెక్ విద్యార్థులకు గల ఉద్యోగ అవకాశాలను వివరించారు. విద్యాభ్యాస సమయంలోనే విద్యార్థులు ఒక మంచి లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఇండియన్ నావెల్ అకాడమీ(కేరళ)సబ్ లెఫ్టినెంట్‌గా ఉన్నత పదవిలో దేశరక్షణ వ్యవస్థలో సేవలందిస్తున్న సాయిరామ్ తమ కళాశాల పూర్వవిద్యార్థి కావడం సంతోషకరమని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ వి.తారాచంద్ పాల్గొన్నారు.



సాయిరామ్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు గౌరవ డాక్టరేట్

వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రముఖ జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ గౌరవ డాక్టరేట్ పొందారు. తన 40 సంవత్సరాల చిత్రకళా ఆధ్యాత్మిక, సేవా రంగాలలో సాధించిన 52 అవార్డులు, రివార్డులు ఎన్నో చిత్రాలు, రికార్డులు సర్టిఫికెట్స్‌ను థీసిస్‌గా సమర్పించి లోగోస్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వారి ద్వారా జెస్టిస్ గౌరవ డాక్టరేట్ పొందారు. యూనివర్సిటీకి చెందిన బిషప్ మోసెస్ వినుకొండకు విచ్చేసి జెస్టిస్ అవార్డులు, చిత్రాలు తదితర విశేషాలు పరిశీలించి ఎఫ్రాయిమ్ చర్చిలో ఏర్పాటు చేసిన సభలో గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. పలువురు పట్టణ రాజకీయ ప్రముఖులు, కవులు, కళాకారులు, పాస్టర్లు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు జెస్టిస్‌ను అభినందించారు.



డయేరియాతో కార్మికుడి మృతి

పిడుగురాళ్ల: డయేరియాతో సున్నపు బట్టి కార్మికుడు మృతి చెందాడు. పట్టణంలోని లెనిన్‌నగర్‌కు చెందిన తిరుమలకొండ ఆంజనేయులు(60) గత శనివారం వాంతులు విరేచనాలు కావటంతో మారుతీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చేరారు. అక్కడ వైద్య సేవలు పొందాడు. మెరుగైన వైద్యం కోసం ఆదివారం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషయంగా ఉండటతో వైద్యులు గత సోమవారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

ఆంజనేయులు మృతికి కార్మిక, ప్రజాసంఘాల నివాళి

డయేరియాతో మృతి చెందిన తిరుమలకొండ ఆంజనేయులు భౌతికకాయాన్ని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సీపీఐఎం జిల్లా అధ్యక్షులు ఓర్సు కృష్ణ, సెంట్రల్ ట్రేడ్‌యూనియన్ నాయకులు వీర్లంకయ్య, కోటేశ్వరరావు, నారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి జె. కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక గృహిణి ఆత్మహత్య



నాదెండ్ల: కడుపు నొప్పి భరించలేక గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఎండుగుంపాలెంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుడికందుల విజయశాంతి (35) కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతోంది. వైద్యులకు చూపినా ఫలితం లేకపోవడంతో సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త సాంబశివరావు వ్యవసాయ పనులు చేస్తుంటాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

ఒంటిపై పెట్రోలు పోసుకొని వ్యక్తి ఆత్మహత్య

అమర్తలూరు(వేమూరు) : ఒంటిపై పెట్రోలు పోసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అమర్తలూరులో మంగళవారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మానుకొండ దిలీప్(35) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో సోమవారం రాత్రి డిశ్చార్జి చేశారు. దీంతో మనస్తాపం చెంది మంగళవారం ఇంటి నుంచి బయటకకు వెళ్లి మద్యం తాగాడు. ఆ తర్వాత మత్తులో ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పు అంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య, ముగ్గులు పిల్లలున్నారు. అమర్తలూరు పోలీసు స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కాలిపోయి చనిపోయిన వ్యక్తి గురించి ఇంత వరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ ప్రారంభం

రేపల్లె రూరల్: పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీ నారాయణ కల్యాణ మండపంలో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలెప్ సహకారంతో ఈ నెల 10 నుంచి ఫ్యాషన్ డిజైనింగ్‌పై మహిళలకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంసీఏ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణా తరగతులు 30 రోజులు కొనసాగుతాయన్నారు. ఆసక్తి గల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సై శ్యామలాదేవి సేవలు అభినందనీయం



బాపట్ల: ఫ్రెండ్లీ పోలీసుగా విశ్రాంత ఎస్సై పిల్లి శ్యామలాదేవి మంచి పేరు తెచ్చుకున్నారని సత్యశోధన నిర్వాహకులు దగ్గుమల్లి శ్యామ్యూల్ పేర్కొన్నారు. సత్యశోధన ఆధ్వర్యంలో విశ్రాంత ఎస్సై పిల్లి శ్యామలాదేవిని ఘనంగా సన్మానించారు. కానిస్టేబుల్ నుంచి ఎస్సైగా ఎదిగిన శ్యామలాదేవి ఉత్తమ సేవలందించి ఫ్రెండ్లీ పోలీసుగా గుర్తింపు తెచ్చుకున్నారని దగ్గుమల్లి శ్యామ్యూల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తమలపాకుల భాస్కరరావు, రౌతు వేణు గోపాల్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



పెదపూడి(వేమూరు): పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు అందజేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగారావు తెలిపారు. అమర్తలూరు మండలంలోని పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు గ్రామానికి చెందిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి ప్రసాద్ ఆయన తండ్రి రామారావు జ్ఞాపకార్థం మిత్రులు విశ్రాంత కండక్టర్ పోలేరమ్మ, నూర్జహానులతో కలసి రూ.5వేలు అందజేశారన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వేజండ్ల ఉమామహేశ్వరరావు కుమార్తె నవ్య 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు పుస్తకాలు మంగళవారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణలీలలుపై ఆధ్యాత్మిక ప్రవచనాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కల్యాణవేదికపై శ్రీ మద్భాగవతం దశమస్కంధం శ్రీకృష్ణలీలలుపై ఆధ్యాత్మిక ప్రవచనాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. బ్రహ్మశ్రీ మల్లాది కైలాసనాథ్ ప్రసంగిస్తూ యమున నదిని విషపూరితంగావించిన కాళీయుడిని శిక్షించి, నదిని ప్రజోపయోగంగా శ్రీకృష్ణుడు మార్చారని అన్నారు. కాళీయుడు అనగా సర్పం రూపంలో ఉన్న రాక్షసుడు అని పేర్కొన్నారు. అంతేగాక నదులను, అడవులను, ప్రకృతి సంపదను అనేక రకాలుగా కలుషితం, విషమంగా చేసే వారందరూ కాళీయులేనని చెప్పారు. ప్రకృతి సంపదను పాడుచేసే వారందరూ పరమాత్ముని చేతిలో శిక్షకు గురవుతారని శ్రీకృష్ణలీలలలో తెలుస్తోందని కైలాసనాథ్ భక్తులకు వివరించారు.

శివాలయంలో వారాహి అమ్మవారి దర్శనం



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లిఖార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామివారి దేవస్థానంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు వారాహిమాతగా దర్శనమిచ్చారు. వారాహి నవరాత్రుల సందర్భంగా ప్రతి యేటా గంగా భ్రమరాంబ అమ్మవారిని వారాహిమాతగా విశేష అలంకరణలు చేస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రశేఖరశర్మ తెలిపారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అరచేయి పండెన్..

అతివ మనసు మురిపించెన్

‘అన్నయ్య దిద్దిన వర్ణాలు అన్నీ అరచేతిలోన హరివిల్లే..గోరింట పండగా..మా ఇంట పండుగా..’ అంటూ ఓ సినీకవి గోరింటాకు గొప్పతనాన్ని తెలియజేస్తూ రాసిన సుమధుర గీతం వింటే మహిళల హృదయాలు పరవశిస్తాయి. ఆషాఢ మాసంలో అతివల మనసు గెలుచుకునే వాటిలో గోరింటాకుకే తొలి ప్రాధాన్యమంటే అతిశయోక్తి కాదు. హైందవ సంస్కృతిలో అంతలా పెనవేసుకుపోయిన గోరింటాకు ప్రతి శుభకార్యంలోనూ తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకునేటట్లు చేసుకుంది.

- గోరింటాకుతో అతివల అందం ద్విగుణీకృతం
- అనవాయితీగా వస్తున్న ఆషాఢం గోరింటాకు ఆచారం
- రసాయనాలతో తయారయ్యే కోన్, మెహందీ వాడకాలను తగ్గిస్తే మేలు
- గోరింటాకుతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు



బాపట్లటౌన్: వివాహ బంధంతో అత్తారింటికి వెళ్లిన ఆడపిల్లలు ఆషాఢమాసంలో పుట్టింటికి వచ్చి వారికి ఎంతో మక్కువ అయిన గోరింటాకు పెట్టుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకుంటారు. మారిన పరిస్థితుల దృష్ట్యా చాలా మంది మహిళలు రసాయనాలు కలిపిన కోన్ మోజులో పడి హైందవ సంస్కృతికి ఆలవాలమైన గోరింటాకు వాడకం తగ్గిస్తున్నారు. రసాయనాలతో తయారు చేసిన కోన్ కన్నా గోరింటాకు ఎంతో శ్రేష్టమని పలు అధ్యయనాల్లో తేటతెల్లమయ్యింది. గోరింట అందాన్నే కాదు ఆరోగ్యాన్ని సైతం ప్రసాదిస్తుంది. గోరింటాకు అంటే ఇష్టపడని మహిళలు ఉండరు. పల్లెల్లోనైనా, పట్టణాల్లోనైనా పండుగలు, శుభకార్యాల వేళ గోరింటాకుకు ఎంతో ప్రాధాన్యమిస్తారు. ముఖ్యంగా ఆషాఢమాసంలో మహిళలు, యువతులు, చిన్నారులతో సహా ఇంటిల్లపాది చేతులకు, పాదాల చుట్టూ అందంగా గోరింటాకు పెట్టుకుంటారు. ఎర్రగా పండిన చేతులు మహిళలు, యువతుల సహజ సౌందర్యానికి అదనపు వన్నెలద్దేవి. ప్రస్తుత కాలంలో పట్టణాల్లో చాలా మంది సహజ సిద్ధమైన గోరింటాకును మాని రెడీమెడ్‌గా షాపుల్లో లభిస్తున్న కోన్‌లను ఆశ్రయిస్తున్నారు. పల్లెల్లో మాత్రం అధికశాతం మంది ఇప్పటికీ సాంప్రదాయాన్ని పాటిస్తూ గోరింటాకునే రుబ్బి పెట్టుకుంటున్నారు.

ఆషాఢంలోనే ఎందుకు..



గోరింటాకు పెట్టుకున్న అతివల అరచేతులు

ఆషాఢమాసం అంటే వర్షాలు జోరుగా పడే రోజులు. నేలంతా తేమగా బురదతో నిండి ఉంటుంది. నిత్యం ఇంటి పనుల్లో తలమునకలయ్యే మహిళలు ఎక్కువగా నీటిని ఉపయోగిస్తుంటారు. తడి నేలపై పదేపదే తిరగాల్సి ఉంటుంది. వర్షాకాలంలో సహజంగా ఉండే తేమ ప్రభావంతో మహిళల చేతులు, కాళ్లు ఒరిసిపోవడంతోపాటు గోళ్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ సమస్యలకు గోరింటాకు నుంచి ఉపశమనం లభిస్తుంది. దీంతో ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకునే సంప్రదాయానికి పెద్దలు తెరలేపారు. గోరింటాకు పెట్టుకోవడం వెనక ఈ ఆరోగ్య ప్రయోజనం దాగుందని పెద్దలు చెబుతున్నారు.

రసాయనాలతో హాని..

పట్టణ ప్రాంతాల్లో గోరింటాకు చెట్లు కనుమరుగవడంతో మార్కెట్‌లో రెడీమేడ్‌గా దొరికే కోన్‌లు, మెహందీలతో సంతృప్తి చెందుతున్నారు. ఫ్యాషన్ మోజులో పడి వీటిపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. గోరింటాకు చెట్టు నుంచి కోసి రుబ్బడం లాంటి పనుల నుంచి తప్పించుకునేందుకు పల్లె ప్రజలు కూడా రసాయన మిశ్రమాలతో తయారు చేసే కోన్‌లు, మెహందీలకు సులభంగా ఆకర్షితులవుతున్నారు. దీనివల్ల అలర్జీలు సోకుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సహజసిద్ధమైన గోరింటాకు ఆరోగ్యానికి ఉపకారిగా మారటమే కాక అతివల అందాన్ని సైతం పెంచుతుంది. ఆషాఢమాసంలో ప్రతి ఇంటా గోరింటను విరివిగా వినియోగించి హైందవ సంస్కృతిని కాపాడుకోవాలని పలువురు భారతీయ ప్రవచనకర్తలు సూచిస్తున్నారు.

ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు..



కొత్త చిగురుతో కళకళలాడుతున్న గోరింటాకు చెట్టు

చేతికి గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో ఉన్న వేడిని తగ్గిస్తుంది. దీన్ని తలకు, కేశాలకు పట్టిస్తే జుట్టు రాలిపోకుండా, మృదువుగా మారటంతో పాటు చుండ్రు, దురద వంటి సమస్యలు దరిచేరవు. ఆటలమ్మ మచ్చలు, గాయాలు, నల్లని మచ్చల నివారణకు గోరింటాకును వినియోగిస్తారు.



గోరింట పడటంతో అరచేతుల ఎర్రదనం

స్త్రీనిధి రుణాల లక్ష్యాన్ని పూర్తి చేయాలి



వేమూరు: స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలు సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం యానిమేటర్ల రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల డేటా లోకోస్ యాప్ ద్వారా యానిమేటర్లు త్వరతగతిన స్వీకరించి పూర్తి చేయాలని సూచించారు. బాపట్ల జిల్లా స్త్రీనిధి బ్యాంక్ ఏజీఎం నాగబాబు మాట్లాడుతూ మండలానికి రికవరీ టార్గెట్ రూ.5 కోట్లకు గానూ రూ.48 లక్షలు చేశారని మిగిలినది త్వరగా రికవరీ చేయాలని ఆదేశించారు. శేషగిరిరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న తరుణంలో వైద్య సిబ్బంది చేపట్టే ర్యాలీలు, అవగాహన సదస్సులలో డ్వాక్రా గ్రూపు సభ్యులు, యానిమేటర్లు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం శోభన్, బుల్లిబాబు, గోల్డ్ మేరీ, ప్రభాకర్, యానిమేటర్లు పాల్గొన్నారు.

హోటళ్లపై ఆహార తనిఖీ అధికారుల దాడులు

చెరుకుపల్లి: మండల కేంద్రమైన చెరుకుపల్లిలోని పలు భోజన హోటళ్లలో ఆహార భద్రత తనిఖీ అధికారి దేవరాజ్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరుకుపల్లిలోని సాయి నక్షత్ర ఆర్యవైశ్య భోజన హోటల్, అరిటాకు హోటళ్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ హోటళ్లలో వినియోగించిన వంట నూనె మరలా వినియోగిస్తున్నట్లుగా సమాచారం ఉందన్నారు. అమ్ముడుపోని ఫ్రై వంటకాలను మరలా వేడిచేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆయా వంట శాంపిల్స్ సేకరించి ల్యాబ్స్‌కు పంపినట్లు చెప్పారు. ఇకపై ప్రతి రోజు భోజన తయారీ కేంద్రాలపై తమ నిఘా ఉంటుందన్నారు. అపరిశుభ్రత వాతావరణంలో వంటకాలు చేసినా, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను కస్టమర్లకు వండి పెట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహనీయుల త్యాగాలకు చిహ్నం మొహరం

- సూఫీ మత గురువుల ఉద్బోధ
- దేశం సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు



వేమవరంలో దువా ప్రార్థనలు నిర్వహిస్తున్న మత గురువులు

వేమవరం(భట్టిప్రోలు): మొహరం పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో మంగళవారం సూఫీ మత గురువులు హజరత్ సయ్యద్ కరిముద్దీన్‌షా ఖాదరి(హైదరాబాద్), హజరత్ సయ్యద్ షా బుఖారీ (దర్గా పీఠాధిపతులు), సూఫీ మత గురువు అల్తాఫ్ బాబా(కొండపల్లి)లు గ్రామంలో పర్యటిస్తూ మహ్మద్ ప్రవక్త బోధనలు గూర్చి తెలియచేశారు. వేమవరంకు చెందిన ఆస్థాన-ఏ ఖాద్రీయ పీఠాధిపతి కరామత్‌షా హజరత్ మాబూ సుభానీ ఆధ్వర్యంలో హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉండాలని, దేశం సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. సూఫీ మత గురువులు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త అధర్మాన్ని, అన్యాయాన్ని వ్యతిరేకించి ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఆకాంక్షించారని అన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవనం కొనసాగించాలని పేర్కొన్నారు. మహ్మదీయులకు మొహరం ముఖ్యమైనదని తెలిపారు. హసన్, హుస్సేన్‌ల స్మారకార్థం శోకా తప్త హృదయాలతో జరుపుకునే కార్యక్రమమే పీర్ల పండుగ మొహరం అని అన్నారు. ముస్లిం పంచాంగం రీత్యా అరేబియాలో సంవత్సరం మొదటి నెల మొహరం అని ..ఆ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఈ పండుగ జరుపుకుంటారని వివరించారు. స్థానిక జెండా చెట్టు వద్ద దువా ప్రత్యేక ప్రార్థనలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో షేక్ లాల్‌జాన్, ముర్షిద్‌లు, ఫకీర్లు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త డిమాండ్స్‌డే విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకురాలు రమాదేవి

భట్టిప్రోలు: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లు అమలు చేయడానికి ఉత్తర్వులు జారీ చేయడానికి సిద్ధ పడటంతో ఈ నెల 10న దేశ వ్యాప్తంగా కార్మికులు నిర్వహిస్తున్న డిమాండ్స్ డేని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షురాలు రమాదేవి కోరారు. మంగళవారం భట్టిప్రోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, నగదు బదిలీకరణ పథకాలను ఆపాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్‌మిషన్, సమగ్ర శిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధిహామీ తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని కోరారు. కనీస వేతనం, పింఛన్ వంటి సామాజిక భద్రత సౌకర్యాలను కల్పించాలని, కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు మురుగుడు సత్యన్నారాయణ, పప్పల మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్కూళ్లలో ఉపాధ్యాయులను నియమించండి



డీఈఓ శైలజకు వినతిపత్రం సమర్పిస్తున్న నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలల్లో అవసరమైన సబ్జెక్టు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ పి.శైలజకు అసోసియేషన్ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలను విన్నవించారు. హైమారావు మాట్లాడుతూ అప్‌గ్రేడ్ అయిన హైస్కూళ్లకు ప్రధానోపాధ్యాయ పోస్టులను మంజూరు చేయడంతో పాటు సీనియార్టీ జాబితాను అప్‌డేట్ చేయాలన్నారు. నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి ప్రకారం పరిశీలన చేసి మిగులు ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలల్లో డిప్యూటేషన్ పద్ధతిలో నియమించాలని కోరారు. డీఈఓను కలసిన వారిలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ ఖలీల్, ఎన్వీ జగదీష్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి జి.అంథోనీబాబు, ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, షేక్ జిలానీబాషా, వై.వీరబాబు, పి.రమేష్, నగర నాయకుడు హరగోపాల్, లలిత్‌బాబు ఉన్నారు.


మణిద్వీప వాసినీ పూజలు



తెనాలి: ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ప్యారడైజ్ గృహ సముదాయంలో ప్రముఖ ఆధ్యాత్మిక సేవకురాలు, భక్తి కీర్తనల గాయని శారద చలపతి ఆధ్వర్యంలో మంగళవారం మణిద్వీప వాసినీ విశేష పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆషాఢ మాసంలో వారాహి నవరాత్రులు సందర్భంగా అమ్మవారిని శాకంబరీ రూపంలో అలంకరించి సేవిస్తారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకం, అర్చనలు, శ్రీ సూక్త, పురుష సూక్త విధానంలో పూజలు నిర్వహించారు. భవాని, బెజ్జంకి నాగమణి, సుశీలమ్మ, జ్యోతి, సుధ, పద్మజ, సునీల్, పద్మావతి, స్వరూప, సామ్రాజ్యం, ఎన్వీ యోగ కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య పాల్గొన్నారు. శారద చలపతిని సత్కరించారు.

కళకళలాడుతున్న మెట్ట పంటలు

- కంద, అరటి పంటలు సాగుచేసేందుకు రైతుల మొగ్గు
- ఈ ఏడాది 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు
- వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో ఆశాజనకమైన దిగుబడులు



భట్టిప్రోలు-పెదపులివర్రు రహదారిలో వరినారు మడి

భట్టిప్రోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో వర్షాలకు మెట్ట పైరులు కళకళ లాడుతున్నాయి. నిన్న మొన్నటి వరకు పంటలు రూపం కోల్పోయాయి. గత ఏడాది కంద, అరటి పంటలకు మంచి ధరలు రావటంతో రైతులు ఎక్కువగా లాభించారు. ఈ ఏడాది కంద, అరటి పంటలు ఎక్కువగా సాగు చేసేందుకు మొగ్గు చూపారు. కందపంట సాగులో మంచి దిగుబడులు వచ్చి రైతులు ఆశించిన స్థాయిలో ధరలు దక్కాయి. దీంతో రైతులు ఈ పంటలపై దృష్టి సారించారు. మండలంలో ఎక్కువగా చింతమోటు, పెదలంక, పెసర్లంక, పెదపులివర్రు, ఓలేరు, గొరిగపూడి తదితర గ్రామాలలో ఈ పంటలు సాగుబడిలో ఉన్నాయి.

సాగుకు సమాయత్తం..

ఖరీఫ్‌కు సాగుకు రైతాంగం సమాయత్తమైంది. ఆటుపోట్లు అన్నింటిని ఎదుర్కోగలమనే ధైర్యంతో ఉన్న రైతులు మాత్రం కొందరు ఇప్పటికే సాగుకు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా కొందరు రైతులు కాల్వలపై ఆధారపడకుండా నారుమళ్లకు బోర్ల ద్వారా, ఆయిల్ ఇంజన్ల సహాయంతో సాగునీటిని అందించారు. మరికొందరు విద్యుత్ మోటార్లతో మెరక ప్రాంతాల్లో నారుమళ్లు పోశారు. మండలంలో ఈ ఏడాది సుమారు 15 వేల ఎకరాలలో ఖరీఫ్ సాగు చేపట్టనున్నారు. బోర్ల సహాయంతో పోసిన నారుమళ్లు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కళకళలాడుతున్నాయి. వర్షాలు సక్రమంగా కురిసి కాల్వల ద్వారా నీరందితే ఖరీఫ్‌లో నాట్లు పూర్తి కాగలవని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



చింతమోటులో కళకళలాడుతున్న కంద పంట

రాయితీపై వరి విత్తనాలు పంపిణీ



సూరేపల్లి(భట్టిప్రోలు): రైతులకు సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలను అందజేయడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖాధికారి జి.మీరయ్య తెలిపారు. మంగళవారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మీరయ్య మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని పేర్కొన్నారు. ఎద పద్ధతి, వరిసాగు చేపట్టే రైతులు 48 గంటల్లోపు పెండి మిథాలిన్ ఎకరాకు లీటర్ చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బి.షరాబంది, వి.శేషుబాబు, సుధాకర్, వీఏఏ నఫీసా, ఎంపీఈవో నరేష్, రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్

తెనాలిరూరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చూడాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీధర్ అన్నారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసులు, రవాణా శాఖ అధికారులతో స్థానిక కోర్టుల ప్రాంగణంలో న్యాయమూర్తులు మంగళవారం సమావేశమై వాహన చట్టాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరు మాత్రమే వెళ్లేలా నిబంధనలు ఉన్నాయని, ముగ్గురు, నలుగురు వెళుతుండడంపై అలక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వాహనాల సైలెన్సర్లు మార్చి శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి పవన్ కుమార్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది కొరత ఉన్నా హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రమాదాలను అరికట్టటమే లక్ష్యంగా పని చేయాలన్నారు. లైసెన్సు కోసం వచ్చే వారికి హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నట్లు మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు తెలిపారు. వారానికి ఒక స్టేషన్ పరిధిలో హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు చేపడతామని వన్ టౌన్ ఎస్ఐలు కరిముల్లా, కోటేశ్వరరావు చెప్పారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భేతాళ ప్రభాకర్, చుండూరు, కొల్లూరు, దుగ్గిరాల, కొల్లిపర పోలీసులు, పారా లీగల్ వలంటీర్లు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పర్యవేక్షకుడు మహబూబ్ పాల్గొన్నారు.

ఐపీసీలో చిప్స్ కళాశాలకు రెండు అవార్డులు

గుంటూరు రూరల్: ఇటీవల హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ (ఐపీసీ)లో తమ కళాశాలకు రెండు అవార్డులు రావటం గర్వంగా ఉందని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల (చిప్స్) ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాల అధ్యాపకులు సమర్పించిన పరిశోధన పత్రాలకు వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు వచ్చినట్లు తెలిపారు. ఫార్మాకాలజీ విభాగంలో ఆర్. సాయిరేష్మ సమర్పించిన పరిశోధన పత్రానికి ప్రథమ, ఫార్మాకాగ్నెసీ విభాగంలో డాక్టర్ పి. విజేత సమర్పించిన పరిశోధన పత్రానికి ద్వితీయ బహుమతి లభించినట్లు పేర్కొన్నారు. ఐపీసీలో జాతీయ, అంతర్జాతీయ ఫార్మా రంగ నిపుణులు, ప్రతినిధులు సుమారు 11 వేల మందికిపైగా పాల్గొన్నారని తెలిపారు. 2,500 మందికిపైగా పరిశోధన పత్రాలను సమర్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, ఆర్ గోపాలకృష్ణలు అవార్డులు పొందిన అధ్యాపకులను అభినందించారు.